## క్లుప్తంగా

### వైఎస్ జగన్‌ను కలిసిన పాలడుగు



జగన్‌కు బొకే అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న రాజీవ్

**నాగులుప్పలపాడు:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా తనను ఎంపిక చేయడంపై వైఎస్సార్ సీపీ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పాలడుగు రాజీవ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో జగన్‌ను రాజీవ్ కలిసి తనపై నమ్మకం ఉంచి సంయుక్త కార్యదర్శిగా ఎంపిక చేయడం పట్ల బొకే అందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఉపాధి పనుల పరిశీలన

**సంతనూతలపాడు:** మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో డీ సురేష్‌బాబు పరిశీలించారు. టార్గెట్ ప్రకారం ఉపాధి పనులకు కూలీలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోజుకు రూ.307 వేతనం తగ్గకుండా కూలీలకు పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ మండల ఏపీవో వాసంతి తదితరులు పాల్గొన్నారు.

### నేడు రైజ్‌లో క్యాంపస్ డ్రైవ్

**ఒంగోలు సిటీ:** ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఇంజినీరింగ్ కళాశాలలో నేడు అపిత, రైజ్ కృష్ణసాయి సంస్థల వారి సౌజన్యంతో విర్ట్యూసా కంపెనీ వారు పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ప్రీ ప్లేస్‌మెంట్ టాక్ తరువాత లెవెల్ 1, లెవల్ 2 రౌండ్‌లు (టెక్నికల్ అండ్ కమ్యూనికేషన్) నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఫైనల్ నియామకం చేస్తారని తెలిపారు. రైజ్ కళాశాలలో ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలిపారు. డ్రైవ్‌కు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా బయోడేటా, ఆధార్, పాన్‌కార్డు, మార్కుల మెమో వెంటతీసుకొని రావాలని తెలిపారు. ఈ డ్రైవ్‌కు వచ్చే విద్యార్థులకు డైరెక్టరు ఏవీ భాస్కరరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రఘుబాబు, చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక శుభాకాంక్షలు తెలిపారు.

### తెలుగు భాషను కాపాడుకోవాలి



మైనంపాటిని సత్కరిస్తున్న అతిథులు

**ఒంగోలు మెట్రో:** తెలుగు భాషను మనందరం కాపాడుకోవాలని ఎర్రన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో తెలుగు భాషా చైతన్య సమితి, లక్ష్మయ్య సాధన ఫౌండేషన్ 12వ వార్షికోత్సవంలో భాగంగా ఆయన కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తెలుగు అంతరించిపోతుందని.. భాష కోసం మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి అవసరం ఎంతో ఉందని తెలిపారు. అనంతరం ఆయనను తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్, ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి లక్ష్యసాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞా రాజు, కుసుమ ధర్మ పీఠం చైర్మన్ డాక్టర్ రాధా కుసుమ దైవజ్ఞ శర్మ ఘనంగా సన్మానించారు.

### ఆశావర్కర్ల సమ్మెను జయప్రదం చేయండి

**హనుమంతునిపాడు:** సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఆశావర్కర్ల సంఘ నేతలు వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మెడికల్ అధికారి దార్ల సందీప్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు కత్తి రూతమ్మ, బాలచెన్నమ్మ, రాణి, ఆశావర్కర్ల నేతలు పాల్గొన్నారు.

### ధర్నాను విజయవంతం చేయండి

**సీఎస్‌పురం(పామూరు):** ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జేఎస్.ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి షేక్. నాయబ్‌రసూల్ కోరారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు ఉండేలా విధంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలు లేదా బేసిక్ ప్రైమరీ స్కూల్స్ మాత్రమే ఉండాలని, అన్ని ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగించాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలని కోరారు.

# కుట్టులోనూ.. కూటమి కనికట్టు !

- ముప్పాతిక సెంటర్లలోనే శిక్షణ ప్రారంభం
- ఎంపికలో రాజకీయ ప్రమేయం
- కేంద్రాల్లో అరకొర సౌకర్యాలు
- సెంటర్లలో పాడైన కుట్టుమిషన్‌ల ఏర్పాటు



చీమకుర్తిలో శిక్షణ పొందుతున్న మహిళలు

**సంతనూతలపాడు:** కూటమి ప్రభుత్వంలో అవినీతికి అంతులేకుండా పోతోంది. ఈ ఏడాది కాలంలో పంచభూతాలను నాశనం చేసి జేబులు నింపుకున్నారు. అయినా కాని సరిపోవడం లేదని తాజాగా కుట్టుమిషన్‌ల మీద పడ్డారు. డ్వాక్రా గ్రూపుల మహిళల ఉపాధి కోసం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణలో కూడా అవినీతికి పాల్పడ్డారంటే అవినీతి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో 30కి పైగా కుట్టు శిక్షణ కేంద్రాలు మంజూరు చేశారు. ఇందులో సగానికి పైన మాత్రమే ప్రారంభమయ్యాయి. సంతనూతలపాడు నియోజకవర్గంలోని సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సంతనూతలపాడు శిక్షణా కేంద్రంలో 144 మంది రిజిస్టర్ చేసుకోగా 120 మంది హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చీమకుర్తి శిక్షణ కేంద్రంలో 144 మంది రిజిస్టర్ చేసుకోగా 92 మంది హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మద్దిపాడు శిక్షణా కేంద్రంలో 144 మంది రిజిస్టర్ చేసుకోగా వందమంది హాజరవుతున్నట్లు టైలరింగ్ ట్రైనింగ్ ఇన్‌చార్జి బ్రహ్మానందం తెలిపారు. కొన్నిచోట్ల లబ్ధి దారులు లేక, ఉన్న వారికి శిక్షణకు అవసరమైన భవనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిబంధనల మేరకు ఒక్కో సెంటర్‌లో 25 కుట్టు మిషన్లు ఏర్పాటు చేయాలి. ఈ క్రమంలో కొన్ని సెంటర్లలో పాత మిషన్లు, పాడైన వాటిని పెట్టి లెక్కకు కనిపించేలా జిమ్మిక్కులు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో శిక్షణ ఎలా సాగుతుందనేది ప్రశార్థకంగా మిగిలింది.

**ప్రస్తుతం జరుగుతోందిలా..**

కొన్ని సెంటర్లలో లబ్ధిదారులు లేక ఇంకా శిక్షణ ప్రారంభం కాలేదు. మరికొన్ని మండలాల్లో ఎంపిక ప్రక్రియ సాగుతూనే ఉంది. శిక్షణ ప్రారంభమైన కేంద్రాల్లోనూ నిబంధనల మేరకు శిక్షణ సాగడం లేదు. కబుర్లతోనే శిక్షణ సమయం ముగించేస్తున్నారు. శిక్షణకు అవసరమైన దారాలు, స్కేల్, కత్తెర తదితర సామగ్రి ఇంకా ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులే తెచ్చుకోవాల్సి వస్తోంది. టైలరింగ్ శిక్షణ కోసం డ్వాక్రా గ్రూపు మహిళలను సచివాలయాల వారీగా ఎంపిక చేశారు. దీంతో ఆయా పంచాయతీల్లోని అధికార పార్టీ నాయకులు సూచించిన వారిని మాత్రమే అధికారులు ఎంపిక చేశారనే విమర్శలు వస్తున్నాయి. కుట్టు శిక్షకుల ఎంపికలోనూ రాజకీయ జోక్యం ఉన్నట్టు తెలిసింది.

**శిక్షణ నిబంధనలివీ..**

ఒక్కో శిక్షణ కేంద్రంలో గరిష్టంగా 120 మంది ఉండాలి. రోజుకు రెండు షిఫ్టులుగా ఉదయం 4 గంటలు, మధ్యాహ్నం 4 గంటలు శిక్షణ ఇవ్వాలి. తొలుత థియరీ, ఆపై పేపర్ కటింగ్, మళ్లీ కుట్టుమిషన్‌పై శిక్షణ ఇవ్వాలి. శిక్షణ కాలంలో కనీసం 75 శాతం హాజరు తప్పనిసరి. ఇందుకు రాను పోనూ వేలిముద్రలతో కూడిన హాజరు వేయాలి. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు రూ.4,300 విలువజేసే కుట్టుమిషన్, స్టైఫండ్ రూ.3 వేలు, మొత్తం ఒక్కొక్కరికి రూ.7,300 ఇవ్వాలి

**అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..**

పది రోజులుగానే శిక్షణ కేంద్రాలను ప్రభుత్వ భవనాల్లో ప్రారంభించాం. ఆయా శాఖలు ఇప్పుడు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తే, వారు బిల్లు పెట్టుకుంటే మేమే చెల్లిస్తాం. అభ్యర్థులకు కుట్టు మిషన్ పై శిక్షణ ఇచ్చే సమయంలో పాడైన కుట్టు మిషన్లను వెంటనే మరమ్మతు చేయిస్తాం. కచ్చితంగా 75 శాతం హాజరున్నవారికే ఉచితంగా కుట్టుమిషన్ ఇస్తాం. శిక్షణ పటిష్టంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– బ్రహ్మానందం, టైలరింగ్ ట్రైనింగ్ ఇన్‌చార్జి, ప్రకాశం జిల్లా

**మౌలిక సదుపాయాలు ఇతర శాఖలపై..**

సెంటర్‌లో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్, ప్రథమ చికిత్స కిట్లు తదితర మౌలిక సదుపాయాలను శిక్షణ కాంట్రాక్టు దక్కించుకున్న వారే ఏర్పాటు చేయాలి. కానీ వీటిని ప్రభుత్వ భవనాలైన వెలుగు కార్యాలయాలు, ఎంపీడీవో ఆఫీసుల్లో పెట్టారు. దీంతో ఆయా శాఖలే ఇప్పుడు అవసరమైన సౌకార్యాలను చేయాల్సి వస్తోంది. దీంతో అరకొర సౌకర్యాల నడుమ శిక్షణ సాగుతోంది.

## సింహ వాహనంపై కన్యకా పరమేశ్వరి అమ్మవారు



అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు



సింహ వాహనంపై దర్శనమిస్తున్న అమ్మవారు

**ఒంగోలు మెట్రో:** వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి సందర్భంగా అమ్మవారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం నగరంలోని గాంధీ రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో తదియారాధన సంఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. తదుపరి 108 మంది కన్నెపిల్లలచే ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరుగంటలకు అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి సింహ వాహనంపై ఒంగోలు పురవీధుల్లో నగరోత్సవం జరిపారు. వాసవి కోలాట భజన మండలి సభ్యులు అద్భుతమైన వాసవి మాత పాటలకు కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు నగర ఉత్సవంలో పాల్గొన్నారు. వాసవి సేవాదళ్ సభ్యులు అన్నకూటోత్సవం ఘనంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో హిందూ భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మ వాసవిమాతకు తమ కోర్కెలు నెరవేరాలని ప్రార్థించారు. ఆలయ పరిసరాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగినది.

## వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



అచలానంద ఆశ్రమంలో అన్నదానం



గ్రామోత్సవంలో వెంకటేశ్వరస్వామి

**నాగులుప్పలపాడు:** మండలంలోని ఉప్పుగుండూరు నీలాయపాలెం పొలిమేరలో వేంచేసి ఉన్న వెంకటేశ్వర స్వామి కల్యాణం వేదపండితుల శిష్టా పాండురంగయ్య ఆధ్వర్యంలో గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తదుపరి నీలాయపాలెం ఉప్పుగుండూరులో గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా ఉప్పుగుండూరులో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో ఆరాధన కార్యక్రమాలు నిర్వహించి గోనుగుంట బ్రహ్మాచారి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించారు. అంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి, విద్యుత్ కాంతులతో గ్రామోత్సవం నిర్వహించారు.

**రమణీయం వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం..**

**ఒంగోలు మెట్రో:** మంగమూరు రోడ్డు అచలానంద ఆశ్రమలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అచలానంద పరిపూర్ణ సిద్ధానంద స్వామి ఆధ్వర్యంలో గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన సంతర్పణ ఏర్పాటు చేశారు.

## గ్రోత్ సెంటర్‌లో వినాయక విగ్రహ ప్రతిష్ఠ



ఒంగోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చుండూరి రవిబాబును సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఒంగోలు ఇన్‌చార్జి రవిబాబు

**మద్దిపాడు:** మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో వరసిద్ధి వినాయక స్వామి ధ్వజ, యంత్ర, విగ్రహప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి గ్రోత్ సెంటర్‌లోని ఆయా పారిశ్రామిక యజమానుల సహకారంతో నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహోత్సవ కార్యక్రమం పిఠాపురానికి చెందిన ఇంజమూరి అచ్యుతానంద శర్మ అవధానిచే గణపతి పూజ, పుణ్యాహవచనం పంచగవ్య ప్రాశనం, అఖండ దీపారాధన గోపూజ గత మూడు రోజుల నుంచి నిర్వహించారు. గురువారం యంత్ర, ధ్వజ, శిఖర, వరసిద్ధి వినాయక స్వామి దివ్య ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి, గోధిష్ఠ, కుంభం పోయుట, అనంతరం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, విగ్రహ దర్శనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వరసిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ధ్వజ స్తంభాన్ని బహూకరించిన వైఎస్సార్ సీపీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబును ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్‌రావు, విజయ్‌కుమార్, 20 సూత్రల కమిటీ చైర్మన్ లంకా దినకర్, మాజీ మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మండవ రంగారావు, మండవ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సుల సేవలు అమూల్యమైనవి



వాకథాన్‌లో పాల్గొన్న ఆస్పత్రి సిబ్బంది

**ఒంగోలు టౌన్:** ఓర్పు నేర్పుతో అహర్నిషలు వైద్యసేవలను అందించే నర్సుల సేవా తత్పరతను ఎన్నటికీ మరచిపోలేమని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. ఇంటర్నేషనల్ నర్సెస్ డే పురస్కరించుకొని గురువారం రమేష్ ఆస్టర్ హాస్పిటల్‌లో వాకథాన్‌ను నిర్వహించారు. సీఈఓ డాక్టర్ నల్లూరి నితిన్ జెండా ఊపి ప్రారంభించిన ఈ వాకథాన్ ఆసుపత్రి నుంచి 5 కిలోమీటర్ల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సింగ్ సిబ్బంది మద్దతు లేకుండా రోగుల ఆరోగ్య సంరక్షణ సాధ్యం కాదన్నారు. రోగుల శ్రేయస్సును కోరుతూ నర్సింగ్ డే స్ఫూర్తితో మరింత అంకితం కావాలని కోరారు. నిజాయితీగా, నిబద్ధతతో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న నర్సింగ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ సూపరిండెంటెంట్ డాక్టర్ వంశీ కృష్ణ, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## 239 పొగాకు బేళ్లు తిరస్కరణ



కొండపిలో వేలానికి హాజరైన వ్యాపారులు



వేలంలో వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

**కొండపి:** స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 239 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఇన్‌చార్జి వేలం నిర్వహణాధికారి శివకుమార్ ది గ్రేట్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని ధర్మవరం, కోయవారిపాలెం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, వెంకటకష్టాపురం గ్రామాలకు చెందిన రైతులు 1220 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 981 బేళ్లు కొనుగోలయ్యాయి. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.210, సరాసరి ధర కేజీ రూ.254.06గా నమోదైంది.

**పొగాకు గరిష్ట ధర రూ.205**

**టంగుటూరు:** స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో గురువారం జరిగిన వేలంలో పొగాకు గరిష్ట ధర రూ.205కు వ్యాపారులు కొనుగోలు చేశారు. రోజురోజుకూ లోగ్రేడు పొగాకు ధరలు తగ్గుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగాకు బోర్డు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టంగుటూరు, జరుగుమల్లి, సాదువారిపాలెం, వావిలేటిపాడు గ్రామాలకు చెందిన రైతులు 648 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 550 బేళ్లు కొనుగోలు జరిగాయి. 98 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280 పలకగా, కనిష్ఠ ధర రూ.205 పలికింది. సరాసరి రూ.242.41 ధర పలికింది.

## సోలార్ పార్కుల ఏర్పాటుకు భూముల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న డీటీ, సర్వేయర్

**పామూరు:** మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్న ప్రాంతాల్లో పీఎం కుసుమ పథకం కింద సోలార్ పార్కులు ఏర్పాటు చేసేందుకు భూములు ఎంపిక చేసి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్..తహసీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. దీనిపై గురువారం డిప్యూటీ తహసీల్దార్ పొన్నరుసు వెంకటేశ్వర్లు మండలంలోని పెదగోగులపల్లి, డీజీపేట, కోవిలంపాడు గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల సమీపంలో ఉన్న భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీజీపేటలో సర్వేనంబర్ 199/1లో 6.75 ఎకరాలు, కోవిలంపాడులో సర్వేనంబర్ 48 లో 4.50 ఎకరాలు, పెదగోగులపల్లెలో 219 సర్వేనంబర్‌లో 13.50 ఎకరాలు ప్రభుత్వ భూములను గుర్తించి సోలార్ పార్కుల ఏర్పాటుకు నివేదికలు తయారుచేసి కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు. వీఆర్‌ఓ ఖాజారఫి, సర్వేయర్ జీవిత పాల్గొన్నారు.

## పత్రికపై దాడి.. ప్రజాస్వామ్యానికి తూట్లు






సాక్షి ఒంగోలు: విజయవాడలోని సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసులు చేసిన అమానుషదాడిని ఖండిస్తూ ప్రకాశం జిల్లాలోని వివిధ జర్నలిస్టుల సంఘాల నాయకులు, సాక్షి సిబ్బంది ఎస్పీ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్వో ఓబులేసును కలిసి వినతిపత్రం అందించారు.